సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం, 10, మే, 2023



అడవుల సంరక్షణతో పర్యావరణానికి మేలు

అడవుల సంరక్షణతో పర్యావరణానికి మేలని డీఎఫ్‌వో నరేంధిరన్ సూచించారు. 8లో



వీధి కుక్కలకు వైద్యం

చర్మవ్యాధులతో బాధపడుతున్న వీధి కుక్కలను గుర్తించి వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 8లో



ఘనంగా మోదమ్మ జాతర

మోదకొండమ్మ అమ్మవారి జాతర చివరి రోజు మంగళవారం ఘనంగా జరిగింది. నేల వేషాలు ఆకట్టుకున్నాయి. 8లో

న్యూస్‌రీల్

నేడు పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- జిల్లావ్యాప్తంగా 15 కేంద్రాలు
- 3,131 మంది హాల్ టికెట్ల స్వీకరణ
- నోడల్ అధికారి డాక్టర్ సుజాత



పాడేరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి,పాడేరు: పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకుగాను పాలిసెట్- 2023 పరీక్ష ఆదివారం జరగనుంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షణలో ప్రశాంతంగా పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో 3,131మంది విద్యార్థులు హాల్ టికెట్లు పొందారని పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

కాటేజీల నిర్మాణం వేగవంతం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



పనులను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

అరకులోయ రూరల్: కాటేజీల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. మండలంలో పద్మాపురం గార్డెన్, కొత్తవలస హెచ్ఎన్‌టీసీ గార్డెన్ల పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కాటేజీల్లో అన్ని సౌకర్యాలు కల్పించి సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీఈ సుబ్బారావు, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజిబాబు, మ్యూజియం క్యూరేటర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



నెల్లిపాక జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎటపాక: మండలంలోని నెల్లిపాక అటవీ చెక్ పోస్టు వద్ద పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఎస్ఐ కె.పార్థసారధి ఆధ్వర్యంలో జాతీయరహదారిపై ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచిపెడుతున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల్లో రవాణా చేస్తున్న సరకులు, డ్రైవర్ల వివరాలు సేకరిస్తున్నారు. గంజాయి రవాణాను నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మండుటెండలో సైతం రహదారిపై పోలీసులు మంగళవారం వాహనాలు తనిఖీలు చేపట్టారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి : తేనెటీగల దాడిలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మారేడుమిల్లి మండలం దొరచింతల పాలెం గ్రామానికి చెందిన కె. అచ్చిరెడ్డి కట్టెల నిమిత్తం గ్రామ సమీపంలోని కొండ పోడుకు వెళ్లాడు. అక్కడ కట్టెలు కొడుతుండగా తేనెటీగలు అతనిపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన అతనిని బంధువులు రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

జి.మాడుగుల: పాడేరు ఐటీడీఏ పరిధిలో ఉన్న గురుకుల కళాశాలలో ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు మంగళవారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించినట్లు కళాశాలల కన్వీనర్, ప్రిన్సిపాల్ పారయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ అరకు, గూడెం కొత్తవీధి, పాడేరు కళాశాలలకు చెందిన బాలికలు అరకు బాలికల కళాశాలలో, అరకు, పెదబయలు కళాశాలలకు చెందిన బాలురు అరకు బాలుర కళాశాలలోను, చింతపల్లి, కొయ్యూరు, జి.మాడుగుల కళాశాలలకు చెందిన విద్యార్థులకు చింతపల్లి బాలురకు కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆయా కళాశాలలో బుధవారం నుంచి విద్యార్థులు హాజరుకావాలని ఆయన కోరారు.

జీడిమామిడి రైతుకు వెన్నుదన్నుగా..

రైతులు సంప్రదించాల్సిన నంబర్:
08864-243099

ఏజెన్సీలోని రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని గిరి రైతుల్లో అధికశాతం మందికి జీడిమామిడి సాగు ప్రధాన ఆధారం. బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానం పరిచయం చేసిన వివిధ రకాలను గతంలో కృషి విజ్ఞాన కేంద్రం, పందిరిమామిడి పరిశోధన స్థానం సరఫరా చేశాయి. వీటిలో బీపీపీ 8, బీపీపీ 10 రకాలు మంచి దిగుబడి రావడంతో ఈ ప్రాంతానికి అనుకూలమని గుర్తించారు. ఈ మేరకు ఆయా రకాల అంటుమొక్కలను రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.



పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో జీడిమామిడి అంటుమొక్కలు

- రైతులకు 1.10 లక్షల అంటుమొక్కలు పంపిణీకి సిద్ధం
- నామమాత్రపు ధరకు సరఫరా
- రంపచోడవరం ఐటీడీఏ ఆధ్వర్యంలో పందిరిమామిడి కేవీకే ఏర్పాట్లు
- 500 హెక్టార్లలో సాగు పెంపు లక్ష్యం

రంపచోడవరం: గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసే జీడిమామిడి సాగును ప్రోత్సహించేందుకు ఐటీడీఏ చర్యలు చేపట్టింది. ఏటా కొంత లక్ష్యాన్ని నిర్దేశించి ఆ మేరకు గిరిజన రైతులతో జీడిమామిడి అంటు మొక్కలను నాటించేందుకు కృషి చేస్తోంది. జిల్లాలో సాగు విస్తీర్ణం 18,077 హెక్టార్లు కాగా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో 15 వేల హెక్టార్లలో ఉంది. ఈ ఏడాది 500 హెక్టార్లలో నాటేందుకు జీడిమామిడి అంటు మొక్కలు సిద్ధం చేస్తున్నారు.

- ఐటీడీఏ పరిధిలోని హార్టికల్చర్ ప్రాజెక్టులో సుమారు 10 వేల అంటు మొక్కలు, కృషి విజ్ఞాన కేంద్రం పందిరిమామిడి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో లక్ష జీడిమామిడి అంటుమొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఇవి జూన్, జూలై నెలల్లో రైతులు పొలంలో నాటుకునేందుకు సిద్ధంగా ఉంటాయి.
- ఏజెన్సీలో మొట్టమొదటగా రైతులు గింజ మొక్కలను నాటుకునేవారు. ఈ మొక్కలు కాపునకు వచ్చేందుకు సుమారుగా ఏడేళ్ల కాలం పట్టేది. ఐటీడీఏ ఉద్యానవన శాఖ ద్వారా అంటు మొక్కలను అందుబాటులోకి తేవడంతో రైతులు వీటినే ఎక్కువగా నాటుకుంటున్నారు.
- అంటు మొక్కలు నాటిన మూడేళ్ల లోపు సుమారు మూడు నుంచి ఐదు కిలోల జీడిమామిడి పిక్కల దిగుబడి వస్తుంది. ఆ తరువాత నుంచి సుమారు 20 కిలోల వరకు వస్తుందని పరిశోధన శాస్త్రవేత్తలు తెలిపారు.
- ఏజెన్సీలో గింజ తోటలు కూడా నాటి చాలా కాలం కావడంతో వీటిని తొలగించి అంటు మొక్కలను నాటుకుంటున్నారు. రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా జీడిమామిడి మొక్కలను పెంచుకునే అవకాశం కల్పించారు. దీంతో రైతులు మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం, వాటిని సక్రమంగా పెంచుకునేందుకు పనిదినాలు లెక్క గట్టడం ద్వారా రైతులు ఉపాధి పొందుతూ జీడిమామిడి మొక్కలను పెంచుకోవచ్చు.

జిల్లాలో సాగు విస్తీర్ణం	:18,077 హెక్టార్లు
రంపచోడవరం ఐటీడీఏ పరిధి	:15 వేల హెక్టార్లు
పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు	:1.10 లక్షలు
రకాలు	: బీపీపీ 8, బీపీపీ 10
దిగుబడి	: చెట్టు ఒక్కంటికి 21 కిలోలు
అంటుమొక్క ధర	: రూ.50

రూ.50కు అంటుమొక్క

కృషి విజ్ఞాన కేంద్రం బీపీపీ -8 రకం అంటు మొక్కలను ఉత్పత్తి చేస్తోంది. హైబ్రిడ్ రకం, గింజల సైజు పెద్దవిగా ఉండి 8.2 గ్రాముల బరువు ఉంటుంది. ఆపిల్ రంగు, పసుపు రంగులో ఉంటాయి. చెట్టు సరాసరి దిగుబడి 21 కిలోల వరకు వస్తుంది. అలాగే బీపీపీ-10ను కూడా రైతులకు అందిస్తున్నారు. ఏజెన్సీలో రైతులకు అంటు మొక్కలను రూ. 50 అందజేస్తున్నారు.

బీపీపీ 8,10 రకాలతో అధిక దిగుబడి

బీపీపీ (బాపట్ల) 1,2,3,4,5,6,8,9,10,11 రకాల మొక్కలు గతంలో రైతులు నాటుకున్నారు. వీటిలో బీపీపీ 8,10 రకాలు ఏజెన్సీ వాతావరణానికి అనుకూలం. ఈ రకం మొక్కలు ఏడు సంవత్సరాలు దాటిన తరువాత చెట్టుకు 15 కిలోల వరకు పిక్కల దిగుబడి వస్తుంది. అందువల్లనే ఈ రకాల అంటుమొక్కలను సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు.

మొక్క ఎంపికలో జాగ్రత్తలు అవసరం



ప్రభుత్వ సంస్థల్లో ఉత్పత్తి చేసే అంటు మొక్కలను రైతులు ఎటువంటి సందేహం లేకుండా నాటుకోవచ్చు. బయట నర్సరీల్లో మొక్కలను కొనేటప్పుడు నాలుగు నెలల వయసు, 10 నుంచి 15 ఆకులు కలిగి ఉన్న నాణ్యమైన అంటు మొక్కలను మాత్రమే తీసుకోవాలి. రెండు అడుగుల లోతున గోతులు తీసుకుని మొక్కలు నాటుకోవాలి. మొక్కలు మధ్య ఏడు మీటర్ల దూరం ఉండాలి.

– డాక్టర్, క్రాంతి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త

సమస్యల సత్వర పరిష్కారానికే జగనన్నకు చెబుదాం



వీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



జగనన్నకు చెబుదాం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- టోల్ ఫ్రీ నంబరు 1902కు ఫోన్ చేయాలని సూచన

సాక్షి,పాడేరు: ప్రజల ఫిర్యాదులు సత్వర పరిష్కారం లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.మంగళవారం సీఎం ప్రారంభించిన కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో స్థానిక కలెక్టరేట్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న జగనన్నకు చెబుదాం టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.1902 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేస్తే సమాచారమంతా సీఎం కార్యాలయానికి కనెక్ట్ అవుతుందన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎస్పీ తుహిన్‌సిన్హా, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు పాల్గొన్నారు.

జగనన్నతోనే గ్రామస్వరాజ్యం :

అరకులోయ రూరల్: గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన జగనన్నకు చెబుదాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనివర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమ లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి 1902కు డయల్ చేయాలని కోరారు. గత ప్రభుత్వాలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. నిత్యం పథకాల మంజూరుతో ప్రతిరోజూ పండగ వాతావరణం నెలకొందన్నారు. అర్హులంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న పాల్గొన్నారు.

వై.గొందిపల్లిలో డయేరియా

- 46 మందికి అస్వస్థత
- ఆరుగురి పరిస్థితి విషమం

గూడెంకొత్తవీధి: మండలంలోని వై.గొందిపల్లిలో డయేరియా ప్రబలింది. గ్రామంలో సుమారు 46 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో గూడెంకొత్తవీధి పీహెచ్‌సీకి మంగళవారం తరలించారు. కలుషిత నీరు తాగడం వల్లనే డయేరియా ప్రబలినట్లు ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి మహేష్ తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గిరిజనులు వినియోగిస్తున్న తాగునీరు కలుషితమైంది. ఈ జలాలు సేవిస్తున్న గిరిజనులు మూడు రోజులుగా డయేరియా బారిన పడినట్లు పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు. తీవ్ర అస్వస్థతకు గురైన వారిలో కిల్లో సురేష్‌కుమార్, విజయ్‌రాజ్, జాన్‌బాబు, రాములమ్మ, వసంత, మంగమ్మ ఉన్నారు. బాధితులు కోలుకునే వరకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి మహేష్ తెలిపారు.



డయేరియా రోగులకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

స్వగ్రామాలకు వస్తామని ఊహించలేదు

- 'మణిపూర్' విద్యార్థులు హేమంత్‌బాబు, అనిల్‌కుమార్, సేలియంట్ జోయ్‌ఫర్
- పాడేరులో బస్సు దిగిన వెంటనే హత్తుకున్న కుటుంబసభ్యులు

సాక్షి,పాడేరు: మణిపూర్‌లో అల్లర్ల నేపథ్యంలో తామంతా ప్రాణభయంతోనే ఉన్నామని, స్వగ్రామాలకు సురక్షింతంగా చేరుకుంటామని ఊహించలేదని విద్యార్థులు హేమంత్‌బాబు, పాడేరుకు చెందిన అనిల్ కుమార్, బి.సేలియంట్ జోయ్‌ఫర్ పేర్కొన్నారు. ఉన్నత విద్యకు మణిపూర్ వెళ్లి అక్కడ జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న జిల్లాకు చెందిన వీరు మంగళవారం రాత్రి పాడేరు క్షేమంగా చేరడంతో కుటుంబ సభ్యుల్లో సంతోషం వ్యక్తమైంది. వారిని ఒక్కసారిగా ఆనందంతో హత్తుకున్నారు. హుకుంపేటకు చెందిన కె.హేమంత్‌బాబు, పాడేరుకు చెందిన అనిల్‌కుమార్, బి.సేలియంట్ జోయ్‌ఫర్ పాడేరు కాంప్లెక్సులో బస్సు దిగిన వెంటనే వారి వద్దకు తండ్రులు ఎలీషారావు, భాస్కరరావు చేరుకున్నారు. హుకుంపేట చేరుకున్న హేమంత్‌బాబును తండ్రి కోరుబిల్లి రవి, పెదనాన్న ప్రవీణ్, కుటుంబ సభ్యులు సంతోషంతో హత్తుకున్నారు.

పైసా ఖర్చులేకుండా..

మణిపూర్‌లో జరిగిన అల్లర్ల నేపథ్యంలో తామంతా ప్రాణభయంతో హాస్టల్‌నే ఉన్నామని విద్యార్థులు కె.హేమంత్‌బాబు, అనిల్‌కుమార్, బి.సేలియంట్ జోయ్‌ఫర్ తెలిపారు. వారు మాట్లాడుతూ తిండి,తాగునీటికి కాస్త ఇబ్బందులు పడ్డామని, అయితే అల్లర్లు అధికంగా ఉండడంతో తమ హాస్టళ్ల చుట్టూ భద్రత దళాల రక్షణ ఉండేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారులు తల్లిదండ్రులతో మాట్లాడటమే కాకుండా తమకు ఎప్పటికప్పుడు ధైర్యం చెప్పేవారన్నారు. సోమవారం భద్రత దళాలు తమ హాస్టల్ నుంచి ఇంఫాల్ విమానాశ్రయానికి చేర్చాయని తెలిపారు. అక్కడ నుంచి మధ్యాహ్నం కోల్‌కతాకు, రాత్రి హైదరాబాద్ విమానంలో చేరుకున్నామని వివరించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు ఏపీ బస్సును ప్రభుత్వం సమకూర్చిందని తెలిపారు. అక్కడి నుంచి కూడా ఇంద్ర ఏసీ బస్సులో అధికారులు విశాఖ పంపించగా రాత్రికి పాడేరుకు క్షేమంగా చేరుకున్నామన్నారు. మణిపూర్ నుంచి ఇంటికి చేరుకునే వరకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్, అధికార యంత్రానికి రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు.



పాడేరు చేరుకున్న హేమంత్‌బాబు,అనిల్‌కుమార్, జోయ్‌ఫర్‌తో తండ్రులు ఎలీషారావు, భాస్కరరావు

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



ఇందిర(ఫైల్)

చింతపల్లి: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సంఘటనలో కరెంట్ హీటర్ షాక్ కొట్టి గిరిజన మహిళ మృతి చెందింది. పెదపైపువీధికి చెందిన గోకాడ ఇందిర (36) ఇంట్లో హీటర్‌ను ఆన్ చేసి, దుస్తులు ఉతుకుతుంది. ఈ నేపథ్యంలో ఆమె తడి దుస్తులతో ఏమరపాటుగా హీటర్ వద్ద వెళ్లడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించినప్పటికీ మృతి చెందినట్టు వైద్యాధికారులు తెలిపారు.

ఆకాంక్షిత జిల్లాల్లో ప్రత్యేక సర్వే

ప్రోగ్రాం డైరెక్టర్ మధుసూదన్



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

చింతపల్లి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆకాంక్షిత జిల్లాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం డైరెక్టర్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, వైఎస్సార్ కడప, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 16 అంశాలపై సర్వే నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. విద్య, వైద్యం, వెనుకబాటుతనం, తాగునీరు, ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్యం తదితర అంశాలపై సర్వే నిర్వహిస్తామన్నారు. మానవాళి అభివృద్ధికి ఈ సర్వే దోహదపడుతుందన్నారు. గ్రామాల్లో సందర్శించి పూర్తి స్థాయి నివేదికలు తయారు చేయాలన్నారు. ఈ మేరకు తమ బృందాలకు మండల స్థాయిలో అధికారులు సహకారం అందించనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ నారాయణరెడ్డి, ఎంపీడీవో లాలం సీతయ్య, ఎంఈవో ప్రసాద్, సీడీపీవో రమ్య పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం పనుల పరిశీలన



జి.మాడుగులలో జెడ్పీ అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న సీఈవో శ్రీరామూర్తి

జి.మాడుగుల: మండల కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులను మంగళవారం జిల్లా ముఖ్యకార్యనిర్వహణాధికారి (సీఈవో) శ్రీరామూర్తి పరిశీలించారు. మండలంలో 15ఫైనాన్స్ నిధులతో చేపట్టిన పనులను ఆయన తనిఖీ చేశారు.

జి.మాడుగులలో జెడ్పీ అతిథి గృహం మరమ్మతులు, స్థానిక రామాలయం ఆవరణలో గల కళావేదికను ఆయన పరిశీలించారు. ఆయా పనులకు 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరితగతిన మరమ్మతుల అంచనాలు రూపొందించి పనులు చేపట్టాలని మండల ఇంజనీరింగ్ అధికారి, పీఆర్ జేఈ మాణిక్యంను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సిబ్బంది పనితీరు తదితర వివరాలను ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు నుంచి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌పై ఫోకస్ !

- ఇంటర్ ఫలితాలతో దిద్దుబాటు చర్యలు
- సబ్జెక్టు టీచర్ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు
- అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు బొనాంజా
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 71 మందికి అవకాశం
- ఎంపికైన వారికి ఒక ఇంక్రిమెంట్

మంజూరైన పోస్టులు

తెలుగు	10	బోటనీ	10
ఇంగ్లిష్	10	జువాలజీ	10
గణితం	08	సివిక్స్	01
ఫిజిక్స్	10	ఎకనామిక్స్	01
కెమిస్ట్రీ	10	కామర్స్	01

- మూడు జిల్లాల్లో ప్లస్ టూ స్కూళ్లు -13

జిల్లా ప్లస్ టూ స్కూళ్లు

- విశాఖ గాజువాక జెడ్పీ హైస్కూల్, గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్, మల్కాపురం జీవీఎంసీ పాఠశాల, గంగవరం జెడ్పీ హైస్కూల్, రాంపురం జెడ్పీ హైస్కూల్, సీతమ్మధారలోని ఎస్ఎంసీహెచ్ఎస్ పీటీ కాలనీ స్కూల్
- అనకాపల్లి కూండ్రం, పరవాడ, పాయకరావుపేట, యలమంచిలి జెడ్పీ హైస్కూళ్లు
- అల్లూరి అడ్డతీగల, దేవీపట్నం, రాజవొమ్మంగి ఆశ్రమ పాఠశాలలు



గోపాలపట్నం ప్లస్ టూ బాలికల హైస్కూల్

విశాఖ విద్య: ఉన్నత విద్యను చేరువలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటైన హైస్కూల్ ప్లస్ చదువులపై విద్యాశాఖాధికారులు ఫోకస్ పెట్టారు. 2022-23లో విద్యా సంవత్సరంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో తొమ్మిది చోట్ల హైస్కూళ్లనే జూనియర్ కాలేజీలు(హైస్కూల్ ప్లస్)గా గుర్తించి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులోకి తీసుకురాగా, తొలి ఏడాది 244 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఆయా హైస్కూళ్లలోనే అర్హత గల సబ్జెక్టు టీచర్లతో ఇంటర్ మొదటి సంవత్సరం పాఠ్యాంశాల బోధన సాగించారు. కానీ వీటిలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. తొమ్మిది హైస్కూల్ ప్లస్ నుంచి కేవలం 11 మంది విద్యార్థులే ఉత్తీర్ణులయ్యారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్లస్ టూ హైస్కూళ్లను ఉన్నతాశయంతో ఏర్పాటు చేసినందున, వీటి బలోపేతంపై దృష్టి సారించారు.

సబ్జెక్టు టీచర్లు నియామకం

హైస్కూల్ ప్లస్‌ను నిర్వహిస్తున్న చోట పూర్తి స్థాయిలో సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండేలా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. 2023-24 విద్యా సంవత్సరానికి ముందుగానే ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్‌తో ఆర్థిక ప్రయోజనం కల్పించి, పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రభుత్వం 71 పోస్టులను మంజూరు చేసింది.

దరఖాస్తు చేసుకోండి



ప్లస్ టూ హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లుగా పనిచేసేందుకు అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం కల్పిస్తున్నాం. ఆయా సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి ఉండాలి. 10వ తేదీ సాయంత్రంలోగా విశాఖపట్నం డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలి.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

బోధన మెరుగుపడుతుంది



ఇంటర్ కోర్సుల ప్రాధాన్యత దృష్ట్యా నాణ్యమైన బోధన అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్లస్ టూ స్కూళ్ల ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవటం వల్ల జిల్లా ఉత్తీర్ణత శాతంపై ప్రభావం చూపింది. సబ్జెక్టు టీచర్ల నియామకంతో బోధన మెరుగుపడుతుంది.

– రాయల సత్యనారాయణ, డీవీఈవో, విశాఖ జిల్లా

పీజీటీ ప్రమోషన్ ఇస్తే మరింత మేలు



ప్లస్ టూ హైస్కూళ్లను బలోపేతం చేసేలా ఉన్నతాధికారుల దృష్టి సారించటం శుభపరిణామం. పోస్టుగ్రాడ్యుయేషన్ అర్హత గల స్కూల్ అసిస్టెంట్‌లకు శాశ్వత ప్రాతిపదికన పీజీటీగా ఉద్యోగోన్నతి కల్పిస్తే ఉపాధ్యాయ వర్గానికి మరింత మేలు చేసినట్లవుతుంది.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి, విశాఖపట్నం

ప్రతీ ఒక్కరికి ఉపాధి

● ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం

రంపచోడవరం: ఏజెన్సీలోని ఉపాధి జాబ్ కార్డులు ఉన్న ప్రతి వ్యక్తికి ఉపాధి పనులు కల్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం మారేడుమిల్లి, వై రామవరం మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ ఏపీడీ, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్‌కార్డులున్న ప్రతి వ్యక్తికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కావలసిన వారికి రోజులు పెంచే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఉపాధి ఏపీడీ డీఎల్ రాంబాబు, ఏపీవోలు ప్రకాష్, రెడ్డి బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మొక్కజొన్న దిగుబడుల పరిశీలన



ఇందుకూరుపేటలో మొక్కజొన్న కల్లాలను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ సిబ్బంది

దేవీపట్నం: ఇందుకూరు, ఇందుకూరుపేటలో మొక్కజొన్న కల్లాలను మార్కుఫెడ్ సిబ్బంది శ్రీ హర్ష ప్రశాంతిలు మంగళవారం పరిశీలించారు.ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మొక్కజొన్న మొలకెత్తడంతో తీవ్రంగా నష్టపోయామని, మద్దతు ధరకు మార్కుఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతులు కోరారు. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

ఒడిశా నుంచి గంజాయి

● విశాఖ మీదుగా ఇతర రాష్ట్రాలకు రవాణా
● వినియోగం నుంచి విక్రయం వరకు గట్టి నిఘా
● తరచూ దాడులతో పెరుగుతున్న కేసులు
● నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ వెల్లడి
● గంజాయి నియంత్రణపై విశాఖ రేంజ్ పరిధిలోని ఎస్పీల సమీక్ష

దొండపర్తి: 'ఒడిశా నుంచి.. రోడ్డు, రైలు, జల రవాణా సదుపాయాలు ఉన్న విశాఖ మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా అవుతోంది. వినియోగదారుల నుంచి విక్రయదారుల వరకు సప్లయ్ చైన్‌పై పోలీసుల డేగ కన్ను ఉంది. ఇందుకోసం పక్క రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయంతో అనేక మంది విక్రయదారులను అరెస్టు చేశాం. గంజాయి రవాణాకు అడ్డుకట్టవేయడంతో పాటు వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తాం'అని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ స్పష్టం చేశారు. పోలీస్ సమావేశ మందిరంలో విశాఖ రేంజ్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలతో డీఐజీ హరికృష్ణతో కలిసి ఒడిశా నుంచి గంజాయి రవాణా నియంత్రణపై సీపీ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో గంజాయి సాగుకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్, ఇతర ప్రాంతాలో గంజాయి సాగు చేసి.. అక్కడి నుంచి అనేక మార్గాల్లో విశాఖకు తీసుకువచ్చి.. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. అటువంటి వారిపై గట్టి నిఘా పెట్టినట్లు చెప్పారు. కేవలం వినియోగదారులను పట్టుకోవడమే కాకుండా వారికి ఎవరు విక్రయించారు? ఎలా వచ్చింది? ఇలా మొత్తం సప్లయ్ చైన్ లింక్‌పై దృష్టి పెడుతున్నామని వివరించారు. ఇటీవల పెందుర్తిలో పట్టుకున్న 450 కిలోల గంజాయి కేసులో అసలు సూత్రధారి కోరాపుట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు చెప్పారు. విశాఖ మీదుగా ఢిల్లీకి తీసుకువెళ్లే ప్రయత్నంలో వారిని పట్టుకున్నట్లు వెల్లడించారు.

గట్టి నిఘాతోనే పెరుగుతున్న కేసులు

గట్టి నిఘా పెట్టి విస్తృతంగా తనిఖీలు చేస్తున్న కారణంగానే కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని సీపీ తెలిపారు. ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గంజాయి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని కారణంగానే 2021లో 221 కేసుల్లో 2,700 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. 2022లో 255 కేసుల్లో 6,200 కేజీలు, ఈ ఏడాది నాలుగు నెలల్లో 88 కేసుల్లో 382 మందిని అరెస్టు చేసి 1800 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చి హోటళ్లలో బస చేసే వారిపై కూడా నిఘా పెట్టినట్లు చెప్పారు. హోటళ్లలో బస చేసే వారు ఎవరైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని.. నగరంలోని 510 హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. 165 ట్రాన్స్‌పోర్టు సంఘాలకు నోటీసులివ్వగా.. ఓ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ ప్రతినిధి ఇచ్చిన సమాచారంతోనే 40 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న వారిని అరెస్ట్ చేశామన్నారు. గంజాయి వినియోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై యువత, విద్యార్థులకు తెలియజేస్తూ.. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం

గంజాయిని రెగ్యులర్‌గా రవాణా, వ్యాపారం చేసే వారి జాబితాను సిద్ధం చేశామని సీపీ తెలిపారు. వీరిపై పీడీ యాక్ట్ అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. వీరిలో కొంత మంది జైలులో ఉన్నారని, వారు బయటకు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. ఒడిశా నుంచి విశాఖకు గంజాయి రాకుండా.. అవసరమైన అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు.




మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, చిత్రంలో డీఐజీ హరికృష్ణ, విశాఖ రేంజ్ పరిధిలోని ఎస్పీలు

అనకాపల్లి జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులు

అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ గంజాయి రవాణా నియంత్రణ కోసం 24 గంటలు తనిఖీ చేసేందుకు నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచే వాటిని పర్యవేక్షించేలా అనుసంధానం చేశామన్నారు. గతేడాదిలో 224 కేసుల్లో 521 మంది అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇందులో 217 మందిపై సస్పెక్ట్, రౌడీషీట్లు తెరిచామన్నారు. అల్లూరి సీతారామరాజు ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు పూర్తి అదుపులో ఉందన్నారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రోత్సహించేందుకు అవసరమయ్యే విత్తనాలు అందించే విషయమై.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంగా జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నియంత్రణలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పార్వతీపురం మన్యం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ కోరాపుట్, రాయగడ్ నుంచి గంజాయి రవాణా అవుతోందన్నారు. ఆయా ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో గత మూడేళ్లలో కేవలం 8 మంది వినియోగదారులను గుర్తించామన్నారు. ఒడిశా నుంచి గంజాయి రవాణా నియంత్రణ కోసం ఇచ్ఛాపురం, ఆముదాలవలస ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. క్యాంపస్ కాప్స్ పేరుతో విద్యార్థులకు చట్టాలపై ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. విజయనగరం ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ 19 కేసుల్లో 46 మంది స్థానిక గంజాయి వ్యాపారులను అరెస్టు చేసినట్లు వివరించారు. జిల్లాలో 4 స్టాటిక్, 7 డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెట్టినట్లు చెప్పారు. దీంతో గత నాలుగు నెలల్లో 145 అంతర్ రాష్ట్ర గంజాయి వ్యాపారులను అరెస్ట్ చేశామన్నారు.

అల్లూరి జిల్లాలో నియంత్రణలో గంజాయి సాగు

గంజాయి సాగు జరిగే అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందని డీఐజీ హరికృష్ణ తెలిపారు. 2021లో పరివర్తన కార్యక్రమం ప్రారంభించిన తర్వాత గంజాయి సాగు నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అప్పట్లో ఆ జిల్లాలో సాగైన 7,515 ఎకరాలను గుర్తించి పూర్తిగా ధ్వంసం చేశామన్నారు. గంజాయి సాగు కారణంగా కలిగే అనర్థాలను గిరిజనులకు వివరించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించినట్లు చెప్పారు. గంజాయి సాగును పూర్తిగా నియంత్రించేందుకు ఇంటెలిజెన్స్ నుంచే కాకుండా శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా గుర్తించి 1,039 ఎకరాలను ధ్వంసం చేశామన్నారు. ప్రస్తుతం అల్లూరి జిల్లాలో గంజాయి సాగు దాదాపుగా నియంత్రణలోకి వచ్చినప్పటికీ.. ఒడిశా నుంచి అల్లూరి జిల్లా మీదుగా గంజాయి రవాణా అవుతున్న విషయాన్ని గుర్తించామన్నారు. దీంతో ఆ రాష్ట్ర పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆరుగురు వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. గంజాయి రవాణా, వ్యాపారులకు సంబంధించి సమాచారాన్ని తెలియజేసేందుకు 14500 టోల్ ఫ్రీ నంబర్ కూడా అందుబాటులో ఉందన్నారు.



ముమ్మరంగా స్ట్రక్చర్ సర్వే

చింతూరు: పోలవరం ముంపులో భాగంగా ప్రాధాన్యత క్రమంలో చేర్చిన చింతూరులో స్ట్రక్చర్(గృహాలు) సర్వే ముమ్మరంగా సాగుతోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న చింతూరు 45.72 కాంటూరు లెవెల్లో ఉంది. కాగా గతేడాది వచ్చిన వరద ప్రభావం ఆధారంగా చింతూరును ప్రాధాన్యత క్రమంలో తొలిదశ ముంపు జాబితాలో చేర్చారు. ఈ మేరకు గ్రామంలోని 1,445 గృహాలను ముంపు జాబితాలో చేర్చి నోటిఫికేషన్ ఇచ్చారు.

ఈ మేరకు గ్రామసభలను ఏర్పాటు చేసి అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం వాటిని 21 క్లస్టర్లుగా విభజించి ఇటీవల స్ట్రక్చర్ వ్యాల్యుయేషన్ సర్వేను అధికారులు ప్రారంభించారు. మూడు బృందాలు సర్వే కార్యక్రమం నిర్వహిస్తుండగా ఇప్పటివరకు 687 గృహాలను సర్వే చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి.

● సర్వేలో భాగంగా ఇంటికి సంబంధించి పొడవు, వెడల్పు కొలతలను సర్వే బృందాల సిబ్బంది నమోదు చేస్తున్నారు. దీంతోపాటు వంటగది, మరుగుదొడ్లు, ప్రహరీలతో పాటు ఇతర కట్టడాల కొలతలను కూడా నమోదు చేస్తున్నారు. ఇంటి యజమానులు చెట్లు కలిగి ఉంటే వాటి వివరాలను, ఇంటి గదుల్లో గచ్చుల వివరాలను కూడా నమోదు చేస్తున్నారు.

● గ్రామంలోని సర్వే నెం 23, 50, 51లోని 60, స్థానిక పోలీసుస్టేషన్ వెనుక 24 కుటుంబాలకు చెందిన గృహాలు సర్వేలో నమోదు కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమ గృహాలను కూడా ముంపు జాబితాలో చేర్చి నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు. సదరు గృహాలు ల్యాండ్ ప్లాన్(ఎల్‌పీ) షెడ్యూల్‌లో లేనందునే వాటిని ముంపు జాబితాలో చేర్చలేదని ఆర్‌అండ్‌ఆర్ అధికారులు తెలిపారు.



చింతూరులో స్ట్రక్చర్ సర్వే నిర్వహిస్తున్న సర్వే బృందం

పారదర్శకంగా సర్వే

చింతూరులో ప్రారంభమైన పోలవరం స్ట్రక్చర్ సర్వే పారదర్శకంగా జరుగుతోందని తహసీల్దార్ కారం సుబ్బారావు తెలిపారు. నోటిఫికేషన్‌లో నమోదైన అన్ని గృహాలకు సర్వే చేపడతామని, 21 క్లస్టర్ల పరిధిలోని 1,445 ఇండ్లకు గాను 9 క్లస్టర్లలో ఇప్పటివరకు 687 ఇళ్ల సర్వే పూర్తయినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం మూడు బృందాలు సర్వే నిర్వహిస్తుండగా సర్వేను మరింత వేగవంతం చేసేందుకు మరో మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సోమవారం నుంచి అదనపు బృందాలతో సర్వేను త్వరితగతిన పూర్తి చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

8 కిలోల గంజాయి పట్టివేత

విశాఖ నగరానికి చెందిన నలుగురు అరెస్టు

అనంతగిరి: ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి రెండు స్కూటీల్లో తరలిస్తున్న ఎనిమిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ కరక రాము తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న రెండు స్కూటీలను తనిఖీ చేయగా ఎనిమిది కిలోల గంజాయి పట్టుబడిందన్నారు.

ఈ కేసులో విశాఖపట్నానికి చెందిన ఎస్.అజయ్, కె.దీపక్ శ్రీను, జి.డానియేల్ రాజు, సి.సుమంత్ అనే నలుగురు యువకులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు తరలించేందుకు ఉపయోగించిన రెండు స్కూటీలను సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

అడవుల సంరక్షణతో పర్యావరణానికి మేలు

రంపచోడవరం డీఎఫ్‌వో నరేంధిరన్

రంపచోడవరం: ఏజెన్సీలోని అడవులను కాపాడుకొని పర్యావరణాన్ని రక్షించుకోవాలని , గిరిజనులు వ్యవసాయం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఎఫ్ఓ నరేంధిరన్ తెలిపారు. మండల కేంద్రంలోని పీఎంఆర్‌సీలో మంగళవారం వరాహ సంస్థ ఏర్పాటుచేసిన రాష్ట్ర అగ్రో ఫారెస్ట్రీ కార్బన్ ప్రాజెక్ట్ ద్వారా గిరిజనుల జీవన ఉపాధిని మెరుగుపరిచే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో నరేంధిరన్‌మాట్లాడుతూ ఏజెన్సీలోని అడవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేసినట్టు తెలిపారు. పోడు పట్టాలు పొందిన రైతులు అడవులను కాపాడుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ వివిధ రకాలైన పంటలు పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వరాహ సీనియర్ మేనేజర్ బెంజిమెన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు లక్ష హెక్టార్లలో వివిధ రకాలైన పండ్ల మొక్కలు, కలప మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. ప్రతి మానవుడు పర్యావరణాన్ని కాపాడుకుంటూ జీవ పరిమణాలని పెంపొందించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. వరాహ టెరిటరీ మేనేజర్ ఎం.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని ఒక పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు చెప్పారు. ప్రకృతి వ్యవసాయం, దమ్ము లేకుండా పంటల సాగు విధానాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా 1981 నుంచి 2023 వరకు ఉష్ణోగ్రతల్లో చేసుకున్న మార్పులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వచ్చే వర్షాకాలం నాటికి వివిధ గ్రామాల్లో పర్యటించి స్థానికులకు అవసరమైన మొక్కలు సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏడీఏ సీహెచ్.కె.వి.చౌదరి, పీఏవో ఎల్. రాంబాబు, జి.అనుదీప్. జె.జార్జిన. మేనేజర్ సుజిత్, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదమ్మ జాతర

● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



అమ్మవారికి పూజలు చేసేందుకు బారులు తీరిన భక్తులు

హుకుంపేట: మోదకొండమ్మ అమ్మవారు జాతర చివరి రోజు మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారు జామునుంచి వేలాదిమంది భక్తులు అమ్మవారి ఘటాలతో ఆలయానికి చేరుకుని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. భారీగా తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. జాతర ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో భారీగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. శక్తి వేషాలు, పులి వేషాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

● చేదోడువాదోడుగా..



వేసవి సెలవులు కావడంతో గిరిజన గ్రామాల్లో చిన్నారులు ఆటపాటలతో పాటు తల్లిదండ్రులకు వ్యవసాయపనుల్లో చేదోడువాదోడుగా ఉంటూ సాయపడుతున్నారు. తామరాపల్లి నుంచి బిరిమిశాల వెళ్లే మార్గంలో ఘాట్‌రోడ్డును ఆనుకొని ఉన్న భూముల్లో నలుగురు చిన్నారులు విత్తనాలు నాటుతూ కనిపించారు. – సాక్షి, పాడేరు

వీధి కుక్కలకు వైద్యం

● కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
● త్వరలో జిల్లా వ్యాప్తంగా అమలు

సాక్షి,పాడేరు: చర్మవ్యాధులతో బాధపడుతున్న వీధి కుక్కలను గుర్తించి వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో పశువైద్యులు, సహాయకులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. వీధి కుక్కలకు వైద్యం అందించేందుకు అవసరమైన మందులు కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ముందుగా పాడేరు మండలంలో వైద్య సేవలు పూర్తయిన తరువాత జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అమలు చేస్తామన్నారు. వంట్లమామిడి, హుకుంపేట పశువైద్యాధికారులు రాజీవ్‌కిషోర్, చరణ్ పాల్గొన్నారు.

చెట్టుకూలి ట్రాఫిక్‌కు అంతరాయం



చింతూరు- మోతుగూడెం రహదారిపై కూలిన చెట్టు

చింతూరు: తులుగొండ, సుకుమామిడి నడుమ ఈదురుగాలికి చెట్టుకూలి రహదారిపై పడడంతో రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చెట్టు పడడంతో చింతూరు నుంచి మోతుగూడెం, రాజమండ్రి నుంచి సీలేరు వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దీంతోపాటు మోతుగూడెం, ఫోర్‌బై వద్ద గాలి దుమారానికి ఓ చెట్టుకూలి రహదారిపై పడింది.